

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

## (చించినాడలో శ్రీ నాన్నగారి ప్రవచనము 25-2-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

హిందువులు భగవంతుని ఎక్కువగా రెండు రూపాలలో ఆరాధిస్తారు. అవి విష్ణు రూపం, శివరూపం. వస్తువు ఒక్కటే రెండు ముఖాలు, ఇద్దరికీ బేధంలేదు, ఎవరిని ఆరాధించినా ఒక్కటే. శివుడిని ఆరాధించినా విష్ణువును ఆరాధించినా అది లోపల ఉన్న సత్యవస్తువుకే వర్తిస్తుంది. అందువలన శివ, కేశవ బేధం పెట్టుకోవద్దు. ఉపాసన కోసం మన పెద్దలు ఇలా ఏర్పాటు చేసారు. పూర్వ గాధలను పురాణాలు అంటారు. పురాణాలు ఏమి చెపుతున్నాయి అంటే ఉన్నది ఒకటే వస్తువు. అనేకంగా ఉంటే ఎంత బాగుంటుంది అని ఆ వస్తువు అనుకొంది. అప్పుడు ఈ పంచభూతములు, జీవకోటి వచ్చింది. జీవుడు లేడు. ఉన్నవాడు శివుడే, కుండలోని నీటిలో ఆకాశము ప్రతిబింబిస్తుంది. ఆ ప్రతిబింబం నిజంకాదు, నీటివలన ప్రతిబింబము మనకు కనబడుతోంది. కుండపగిలిన ఆకాశమునకు ఏమీ భంగం లేదు. శివుడు ఆకాశంలాంటివాడు, కుండలో కనబడే ప్రతిబింబము జీవుడులాంటిది. జీవుడు లేకుండా శివుడు ఉండగలడు గాని శివుడు లేకుండా జీవుడు లేడు. అసలు ఉన్నది శివుడే జీవుడు లేడు. జీవుడుగా ఎందుకు కనిపిస్తున్నాడు అంటే మాయవలన కనిపిస్తున్నాడు. ఈ పంచభూతములు ఉన్నప్పుడు, పంచభూతములు లేనప్పుడు కూడా ఒక సత్యవస్తువు ఉంది. దానినే బ్రహ్మం అంటారు. ఈ సృష్టి కనబడినా, ఈ సృష్టి కనబడకపోయినా ఆ వస్తువు ఉంటుంది. అది దృశ్యరహితం. జ్ఞానం దృశ్యరహితంగా ఉంటుంది. పురాణాలలో ఏమని చెపుతారు అంటే శివుడు జ్ఞానాన్ని ఇస్తాడు, విష్ణువు మోక్షాన్ని ఇస్తాడు అని చెపుతారు. శివుడు ఇచ్చే జ్ఞానం, విష్ణువు ఇచ్చే మోక్షం ఒక్కటే. ఈ రెండు వేరు అనుకోవటం వలన మనకు కంగారు వస్తోందిగాని ఇవి రెండూ ఒక్కటే.

పుట్టిన ప్రతీ మనిషికి ఒక కులం ఉంటుంది, ఒక మతం ఉంటుంది, ఒక దేశం ఉంటుంది, ఒక కులంలో పుట్టటం పొరపాటు కాదు. చనిపోయేటప్పుడు కూడా ఆ కులభావం విడిచిపెట్టలేనివాడు మోక్షం పొందలేడు. మేము హిందూమతంలో పుట్టాము, మేము క్రైస్తవమతంలో పుట్టాము, మేము బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాము, మేము వైశ్యుల కుటుంబంలో పుట్టాము, మేము భారతదేశంలో పుట్టాను అనుకొనేవాడికి ఎవడికీ జ్ఞానంరాదు. మన హృదయంలోని బ్రహ్మం ఒక కులానికి, ఒక దేశానికి చెందినదికాదు. లోపలఉన్న వస్తువు కులాతీతము, మతాతీతము, భౌతిక హద్దులకు అతీతము. బ్రహ్మానుభవం పొందినవాడు ఒక కులంతో గాని, ఒక దేశంతో గాని దేనితోనూతాదాప్యం పొందడు. వాడు తాదాప్యం చెందాడావాడు బద్ధజీవుడేగాని ముక్తజీవుడు కాదు. నేను తెలివిగలవాడిని అనుకొంటున్నారు అనుకోండి. అంటే నేను అనే తలంపు మీ తెలివితో తాదాప్యం పొందుతోంది. కాని

మీ హృదయంలో ఉన్న నిజం దేనితోను తాదాప్యం చెందదు. మీరు దేనితో అయినా తాదాప్యం పొందుతున్నారు అంటే మీకు లోపల ఉన్న వస్తువు తెలియలేదు అని అర్థం. తాదాప్యం పొందేది అహంభావన, దేనితోనూ తాదాప్యం పొందకుండా స్వేచ్ఛగా స్వతంత్రంగా ఉండేది బ్రహ్మభావన. కొంత మంది ప్రేమ కుటుంబానికి పరిమితమై ఉంటుంది. మిగిలిన వారిని ప్రేమించరు. అంతకంటే మానసిక వికాశము కలుగదు. కొంతమంది కులాన్ని, కొంతమంది కులానికి అతీతంగా మతాన్ని ప్రేమిస్తారు. వారి మతంకాని వారిని ప్రేమించరు. వారు కూడా బద్ధజీవులే. వారికి కూడా జ్ఞానం కలుగలేదు అని అర్థం. ఎవడికైతే బ్రహ్మభావన కలిగిందో వాడి ప్రేమ, వాడి శాంతి విశ్వవ్యాప్తమవుతుంది. మన ప్రేమ విశ్వవ్యాప్తం అవ్వటంలేదు అంటే మనం హద్దులలో నుండి బయటకు రాలేదు అని అర్థం.

దేవుడు ఉన్నాడు అని నమ్మేవారి దగ్గరకు ఎవరైనా వచ్చి దేవుడు లేడు అంటే కోపం వస్తుంది. ఈ విషయంలో భగవాన్ చాలా నిర్మలంగా, చాలా శాంతముగా ఉన్నారు. దేవుడు లేడు అని ఆయన దగ్గర ఎవరైనా అంటే దేవుడు ఉన్నాడు అని వారికి నచ్చచెప్పటానికి ఆయన ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు. దేవుడు ఉన్నాడు అని చెప్పేవాడికి దేవుడు గురించి తెలియదు, దేవుడు లేడు అని చెప్పేవాడికి దేవుడు గురించి తెలియదు. దేవుడు ఉన్నాడు అని చెప్పటానికి గాని, దేవుడు లేడు అని చెప్పటానికి గాని నేను ఉండాలి. ఆ నేను ఏమిటో నీకు తెలిస్తే గాని దేవుడు ఎవడో నీకు తెలియదు. మీరు నమ్మండి. మీరు విశ్వసించండి అని ఆరకంగా ఆయన బోధించలేదు. నమ్మకాల మీద, విశ్వాసాలమీద ఆయన బోధ ఆధారపడిలేదు, శాస్త్రీయ పద్ధతులు మీద ఆధారపడే చెప్పారు. ఒక సత్యవస్తువు మన అధ్యాత్మికహృదయంలో ఉంది, అదే చైతన్యం, ఆత్మ, భగవంతుడు. నాకు మరణానుభవం కలిగినపుడు ఆధ్యాత్మికహృదయానికి, ఈ భౌతికదేహానికి ఇసుమంతయు సంబంధంలేదు అని అనుభవంలోనికి వచ్చింది అని భగవాన్ చెప్పారు. ఇది తలంపుకాదు, ఇది ఊహకాదు, ఇది భావనకాదు, ఇది వాస్తవం. తలంపు వేరు, వాస్తవం వేరు, వేదంలో చెప్పిన జీవుడినే భగవాన్ మిథ్యా నేను అన్నారు. మీకు మిథ్యానేను నశించకుండా, ప్రాపంచిక రుగ్మతలు అన్ని ఏ మనస్సులో ఉన్నాయో ఆ మనస్సు నశించకుండా మీకు మోక్షం వచ్చే అవకాశం లేదు. ప్రతీ మనిషికి ఏదో వెలితి ఉంటుంది, ఏదో దుఃఖం ఉంటుంది. ఆ దుఃఖానికి ఏదైతే కారణమో ఆ కారణమును తొలగించేవాడు రుద్రుడు, వాడే శివుడు. మన ప్రార్థనలు, సాధనలు ఎలా ఉన్నాయి అంటే ప్రార్థించి, ప్రార్థించి భగవంతునిలో ఐక్యం అవ్వాలి అనుకోవటం లేదు, మన వాంఛలను భగవంతుడు నెరవేర్చాలి అనుకొంటున్నాము. మన సంకల్పమును భగవంతుడు నెరవేర్చాలి అనుకొంటున్నాము గాని భగవంతుని సంకల్పమును మనం గౌరవించటం లేదు. ప్రస్తుతం మన భక్తి యొక్క స్థితి ఇలా ఉంది. ప్రార్థన ఎందుకు అంటే దేవుని పాదాల దగ్గరకు తీసుకొని వెళితేనే ప్రార్థన ఉపయోగపడుతుంది. ఆత్మానుభవం కలగటానికి అహంభావన రహితమైన జీవితం ముఖ్యం. అహంభావన రహితంగా జీవించటానికి నీవు చేసే పూజ, జపం, ధ్యానం సహకరించాలి.

శివుడు అవతారములలో మొదటిది దక్షిణామూర్తి. ఆయన మౌనంతో బోధించారు. తరువాత

అవతారం ఆచార్యుల వారు ఆయన మాటల ద్వారా, రచనల ద్వారా భోదించారు సామాన్య మానవులకు అర్ధమయ్యేలా సరళంగా బోధించారు. తరువాత రమణావతారం. ఈయన దక్షిణామూర్తి భాగం కొంత, ఆచార్యులవారి భాగం కొంత తీసుకున్నారు. మౌనం ద్వారా చెపితే ఆవ్యక్తికి అర్ధమవుతుంది అంటే మౌనంగా బోధించేవారు, లేకపోతే మాటలు చెప్పేవారు, అక్కడ మౌనమా, మాటలా అనేది ప్రధానం కాదు, మనోవికాశం కలగటం ప్రధానం. వ్యక్తి వస్తువుగా ఉంటే మౌనబోధ అర్ధంకాదు, మాటలు చెప్పినా అర్ధంకాదు, మనం వ్యక్తులుగా లేము, వస్తువులుగా ఉన్నాము. ఇప్పుడు మనకు మైసూర్‌పాక్ ఇష్టం అనుకోండి దానినే స్మరిస్తాము. అప్పుడు మనం వ్యక్తిగా ఉండము, మైసూర్‌పాక్ అయిపోతాము. ఏదైతే స్మరిస్తున్నామో అదే మనం అవుతాము. వ్యక్తి వ్యక్తిగా ఉంటే మనం చెప్పిన బోధ ఒకసారి కాకపోయినా మరోసారి అయిన వాడికి అర్ధమవుతుంది. వ్యక్తి వస్తువు అయినవాడికి ఏ మహత్ముడు చెప్పినా అర్ధంకాదు. మౌనంగా చెప్పినది అర్ధమయితే వారిని పండిన పండు అనే వారు భగవాన్ కొంత మంది మాటలు చెప్పిన అర్ధంచేసుకొనే వారు కాదు. అటువంటివారిని వారు వచ్చినారు, వెళ్ళినారు అనేవారు. అంతమాత్రం చేత మహర్షుల దర్శనం ఊరికే పోదు. మహాత్ముల దర్శనంవలన మనలోని లోపాలు కొన్ని నశిస్తాయి. ఇక్కడకు వచ్చినవారు ఎవరూ వట్టి చేతులతో వెళ్ళరు. నాస్తికులు ఆస్తికులు అవుతారు, ఆస్తికులు భక్తులు అవుతారు, భక్తులు జ్ఞానులు అవుతారు అన్నారు భగవాన్.

నీ హృదయంలో ఉన్న శాంతి, ఆనందము నీకు అందకుండా చేసేది మిధ్యా నేను మాత్రమే. ఈ మిధ్యా నేను మామూలుగా నీ సాధనల వలన తగ్గితే సరే లేకపోతే బలవంతముగా అయినా దానిని తొలగించు. వైరాగ్యము అనే అస్త్రముతో దానిని నరుకు అన్నారు ఆచార్యులవారు. వైరాగ్యము లేకపోతే మిధ్యానేను తొలగించుకోవటం మాట ఎలా ఉన్నా కనీసం దానిని షేక్ చేయలేవు. నీ సాధనల వలన మొదట మిధ్యా నేనును షేక్ చేయటానికి ప్రయత్నించు తరువాత నెమ్మదిగా దానిని తొలగించుకో, మిధ్యానేనును తొలగించుకోకపోతే నీ హృదయంలో ఉన్న ఆనందము నీకు అందదు. నీ హృదయంలో ఉన్న ఆనందం నీకు అందే వరకూ దేనితో ఒక దానితో తాదాప్యం పొందుతూనే ఉంటావు, జన్మలు వస్తూనే ఉంటాయి. నేను ధనవంతుడిని, నేను గొప్పవాడిని, నేను అది చేసాను అని కొంటూ ఉంటావు. ఇవి అన్నీ తలంపులే. నీ దేహం కూడా ఒక తలంపే ఇలా తలంపులు పెట్టుకొన్నంత కాలము లోపల ఉన్న సత్యవస్తువు నీకు తెలియదు. ఎందుచేతనంటే దానికి తలంపు లేదు. జన్మ ఒక తలంపు మరణం ఒక తలంపు, నీదుఃఖం ఒక తలంపు, సంతోషం ఒక తలంపు ప్రతీదీ తలంపే జీవితం పొడుగునా తలంపులే. ఈ తలంపుల యొక్క వేగమును ఆపుచేయలేకపోతున్నావు. అందువలన కోటిజన్మలు ఎత్తినా కూడా లోపల ఉన్న తలంపులు లేని వస్తువు నీకు తెలియనే తెలియదు. తలంపులు లేని స్థితికి వెళ్ళినప్పుడు కదా తలంపులు లేని వస్తువు నీకు దొరికేది. ఈ బోధ నీబాధను పెంచటానికి కాదు, నీ బాధను తగ్గించటానికే ఇది అంతా. ఈ బోధ పేరు మీద నీ బాధ పెరుగుతూ ఉంటే ఈ బోధ అనవసరం.

నీవు ఆత్మవు, నీవు చైతన్యస్వరూపుడవు, నీవు ఆనందస్వరూపుడవు, అయితే ఆనందం నీకు అందకుండా ఎవరో ఇతరులు అడ్డురావటం లేదు. మిధ్యా నేనే అడ్డు వస్తోంది, దానిని కత్తిరించు. ఈ మిధ్యానేనుతో తాదాప్యం పొందటం ఎప్పుడైతే మానివేసావో అప్పుడు నీవు దేహంలో ఉన్నా దేహం లేనివాడితో సమానము. అప్పుడు మనస్సు గొడవ, దేవుడు గొడవలేదు. ఎందుచేతనంటే మిధ్యానేను వచ్చాక లోకం వచ్చింది, లోకం వచ్చాక దేవుడు వచ్చాడు. నీ కళ్ళకు కనిపించే ఈ ప్రపంచం, దేహం, నీవు పూజించే దేవుడు మిధ్యా నేను అనే ఒంటి స్థంబం మీద ఆధారపడి ఉన్నారు. మిమ్మల్ని బాధ పెట్టటానికి కాదు ఈ బోధ అంతా. మిమ్మల్ని నిజం దగ్గరకు తీసుకొని వెళ్ళటానికి, ఆ నిజంలో నిలకడగా ఉండటం కోసమే ఈ బోధ. నీ హృదయంలో ఉన్న నిజంలో నిలకడగా ఉంటే గాని దేహబుద్ధి నశించి నీకు ఆత్మబుద్ధి కలుగదు. అందువలన నిజంలో నిష్ట కలిగించటానికే ఈ భోధ మీ హృదయంలో ఉన్న నిజంలో మీకు నిష్ట లేదు. ఆ నిజంలో నిష్ట ఉంటే నిజం తానుగా నీకు వ్యక్తమవుతుంది. ఈ బోధ అంతాకూడా నీ హృదయంలో ఉన్న నిజం దగ్గరకు తీసుకొని వెళ్ళటానికే గాని సమాజాన్నిగాని, అనుచరులనుగాని, భక్తులనుగాని పెంచుకోవటం ఈ బోధ యొక్క లక్ష్యంకాదు.

మానవుడు మంచిగా ఉండాలి అనుకొంటాడు, వివేకవంతుడిగా జీవించాలి అనుకొంటాడు, శాంతిగా జీవించాలి అనుకొంటాడు. తాను ఏరకంగా జీవించాలి అనుకొంటున్నాడో ఆ రకంగా జీవించలేకపోతున్నాడు. దీనికి కారణం ఏమిటి అని అడిగితే కోరిక అని కృష్ణుడు చెప్పాడు. అయితే ఈ కోరిక ఎక్కడో బయట లేదు నీ మనస్సులోనే ఉంటుంది, నీ లోపలే ఉంటుంది, భగవాన్ ఏమి చెప్పారు అంటే నీకు ఎన్ని కోరికలు ఉన్నా ఉండనియ్యి నీవు కంగారు పడవద్దు. కోరిక కూడా ఒక తలంపే ఆ కోరిక ఎవరికి వస్తోంది అని ప్రశ్నించుకో నేనుకు వస్తోంది ఆ నేను ఎవరు ఆనేను ఎవరుఆ నేను కూడా ఒకతలంపే ఆ తలంపుకు, ఈ తలంపుకు తేడా ఏమిటి అంటే నేను అనేది మొదటి తలంపు, కోరిక అనేది ఇంకో తలంపు, మొదటి తలంపుకు మిగతా తలంపులు వస్తున్నాయి మొదటి తలంపు రాకుండా ఇతర తలంపులురావు. నేను అనే మొదటితలంపును తొలగించుకో. ఎక్కడైతే నేను అనే మొదటి తలంపు కొంచము కూడా లేదో అక్కడే నీ స్వరూపం ఉంది.

జ్ఞాని యొక్క ప్రేమకు అవధులు ఉండవు. వ్యాపారస్తులు డబ్బుకోసం, రాజకీయనాయకులు అధికారం కోసం కష్టపడుతున్నారు మరి గౌతమబుద్ధుడు, శంకరాచార్యులవారు అంతకంటే ఎక్కువ కష్ట పడ్డారు. దేనికోసం వారు కష్ట పడ్డారు ? వారు ఏ నిర్వాణ స్థితిని అయితే పొందారో, ఏఆనంద స్థితిని అయితే పొందారో మానవజాతిని ఆ స్థితికి తీసుకొని పోవటానికి వారు ఎక్కువ కష్టపడ్డారు. అంతకంటే భౌతికమైన ప్రయోజనం ఏమీ కనబడదు. తాము పొందిన ఆనంద స్థితికి సమాజమును తీసుకొని పోవటానికి కొంతమంది మౌనంగా బోధించారు, కొంతమంది మాటలు చెప్పారు. కొంతమంది రచనలు చేసారు. కొంతమంది పాటలు పాడారు. ఎవరి పద్ధతిలో వారు చేసారు కాని గమ్యం ఒక్కటే. వారు ఎందుకు ఇంత కష్ట పడ్డారు అని లౌకికంగా ఆలోచిస్తే సమాధానం దొరకదు.

ఎందుకంటే వారు లౌకికులు కాదు అలౌకికులు. ఆత్మ సమానంగా ఉంది. అన్ని ప్రాంతములలోను, కులాలలోను, జాతులలోను, రంగులలోను, అన్నింటిలోను సమానంగా ఉంది. ఆత్మ ఎంత సమానంగా ఉందో నీ మనస్సు అంత సమానంగా ఉంటే నీవు తాను అవుతావు. చైతన్యం తానుగా ఉంటుంది, అహంభావన నేనుగాఉంటుంది. నీవు కూరగాయల కోసం సంత లోనికి ఎలా వెళుతున్నావో, బట్టలు కావాలంటే బట్టలకొట్టు లోనికి ఎలా వెళుతున్నావో అలాగేనీవు శాంతి కోసం, ఆనందంకోసం, చైతన్య స్థాయి పెంచుకోవటం కోసం అది అనుభవంలో ఉన్నవారిని ఆశ్రయించవలసిందే, ఇంకో గత్యంతరములేదు.నీకు శాంతి, ఆనందం కావాలంటే అది ఎవరికి అనుభవంలో ఉందో వారిని ఆశ్రయిస్తే అది దొరుకుతుంది గాని అది లేని చోట వెదికినా దొరకదు. మీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా అది అనుభవంలో ఉన్న వారిని ఆశ్రయించవలసిందే లేకపోతే అది మీకు సొమ్ముకాదు.

నీవు ఈ ప్రపంచంలోనికి రావటానికి కారణం అహంభావనే ఈ సంసారచక్రానికి అహంభావనే కారణం. నీవు ఆత్మవే అయినా ఆత్మానుభవం కలుగకుండా చేసేది నీ అహంభావనే. కాబట్టి అహంభావనే నీకు నిజమైన శత్రువు. మనం తినే అన్నంలో ముల్లు ఉంది అనుకోండి. ఆ ముల్లు కంఠానికి పట్టుకొంటే అది లోపలకు వెళ్లదు, బయటకు రాదు, అన్నంతిననివ్వదు, బాధ పెడుతుంది. ఇప్పుడు అహంభావన మనలను అలా పట్టుకొంది. అందువలన వివేకం అనే పట్టుకారుతో దానిని తొలగించు, ఎప్పుడైతే దానిని తొలిగించావో నీ హృదయంలో ఉన్న ఆనందాన్ని ఎంత అనుభవించినా అనుభవించవచ్చును అప్పుడు ఆనందమే ఆనందాన్ని అనుభవిస్తుంది. దీనిని ఊహించటానికి ప్రయత్నించకు. ఊహిస్తే మనస్సు వెళ్లి అక్కడ కూర్చొంటుంది. అది అనుభవించటానికి ప్రయత్నించు, ఇతరుల దేహాలు చనిపోయినప్పుడు నీకు దుఃఖం వస్తుంది, నీ దేహమే నీవు కానప్పుడు ఇతరుల దేహాలు వారు ఎలా అవుతారు. అయినప్పటికి నీకు దుఃఖం వస్తుంది. దీనికి కేవలం ఎటాచ్‌మెంట్ కారణం. నీ హృదయంలో నిజం ఉంది. అందులో నీకు నిలకడ కలిగేవరకూ ప్రాపంచిక విషయాలకు మనస్సు ఆకర్షింపబడుతుంది. మనస్సు చైతన్యంలో కలిసేవరకూ బాహ్యంగా విజృంభిస్తూనే ఉంటుంది. విషయచింతన చేస్తూ ఉంటే అహంభావన పెరుగుతుంది. ఆత్మచింతన వలన అహంభావన తగ్గుతుంది. విషయచింతన మూలతలంపు యొక్క మూలం తెలుసుకోవటానికి సహకరించదు. మూల వస్తువు నీకు తెలిసే వరకూ ఆరోపింపబడిన వస్తువు నీకు కనిపిస్తూ ఉంటుంది. ఆకర్షణ కలుగుతూ ఉంటుంది. దానిని సంపాదించటానికి ప్రయత్నిస్తావు. ఏదో సాధిస్తావు కాని అది కూడా స్వప్నంతో సమానము. నీకు ఆత్మజ్ఞానము కలిగిన తరువాత లోకజ్ఞానము వస్తే నష్టం ఏమీ లేదు. ఆత్మజ్ఞానం లేకుండా లోకజ్ఞానం సంపాదిస్తే ఒకటిలేని సున్నలతో సమానము. దానికి విలువ ఏమీ ఉండదు. చిల్లర కోరికలకు అవకాశం ఇవ్వవద్దు. ఆత్మానుభవం పొందాలి అనే దానికి తప్ప ఇతర కోరికలకు అవకాశం ఇవ్వవద్దు. అల్ప విషయాల జోలికి వెళ్లవద్దు. ఆత్మ జ్ఞానము సంపాదించటానికి ప్రయత్నం చేస్తున్నాము అనుకోండి. మధ్యలో లోకవిషయాలు వింటాము. లోకవిషయాలు మీ నిష్టకు భంగం కలుగజేస్తూ ఉంటే వెంటనే వాటిని కట్ చేయాలి. ఏదో సాధన ద్వారా మనస్సును అణిచి

ఉంచినా మరల విషయ చింతనవస్తే విజృంభించి బాహ్యానికి వచ్చేస్తుంది. మనస్సు మూలంలో నశించే వరకూ దానిని నమ్మటానికి వీలు లేదు. కాలాన్ని పాడుచేసుకోవద్దు. పొందవలసిన వస్తువును ఇక్కడే పొందాలి. శరీరం మరణించిన తరువాత సాధనకు అవకాశం లేదు. ప్రతిక్షణం జాగ్రత్తగా ఉంటూ వస్తువును పొందటానికి ప్రయత్నం చేయండి.

## (పాలకోడేరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 26-2-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

నీవు దేహము కాదు, నీవు మనస్సు కాదు, నీవు బ్రహ్మము అని వేదము చెపుతోంది, అన్ని మతములు చెపుతున్నాయి. నీవు బ్రహ్మము కాదు అని నీకు తలంపులు వస్తూ ఉంటే నీవు బ్రహ్మమునకు దూరమయిపోతావు, నీవు ఏదైతే అవునో దానికి వ్యతిరేఖమైన తలంపులు వస్తూ ఉంటే వాటిని కంట్రోలు చేయాలి. అనుగ్రహం బయట లేదు, నీలోపలే ఉంది. మనకు చిత్తశుద్ధి కలిగితే లోపల ఉన్న అనుగ్రహం మనకు అందుతుంది. చిత్తశుద్ధి లేకపోతే లోపల అనుగ్రహం ఉన్నా మనకు అందదు, చిత్తశుద్ధి సంపాదించటానికి అనుగుణంగా మనం జీవించాలి. మనం చేస్తున్న పూజ, జపం, ధ్యానం మన ప్రయత్నానికి సపోర్టుగా ఉండాలి. ప్రపంచంలో ఏ సంఘటనకు మీరు కంగారుపడకండి, మీ మనస్సుకు ఆందోళన వద్దు. ప్రతీ చిన్న విషయానికి కంగారుపడితే మీరు నష్టపోతారు. ఈశ్వరుడు ఉన్నాడు అనే విశ్వాసం పెంచుకోవాలి. భగవంతుడిని తెలుసుకొనే ప్రయత్నంలో ఎవడైతే ఉన్నాడో వాడితో సహవాసం చెయ్యాలి. రాగద్వేషములు తగ్గించుకొని మనస్సు పల్చబడేటట్లు చేసుకొంటే మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. నీకు అంతర్దృష్టి కలిగినప్పడు లోకం అంతా బ్రహ్మముగానే కనబడుతుంది. అప్పడు నీ లోపల నుండి మౌనం, శక్తి ఉదయిస్తుంది. ఆ శక్తి ద్వారా ఈశ్వరుడితో మాట్లాడవచ్చు, ఆయనను దర్శించవచ్చు అంతే కాదు ఆయనలో ఐక్యం అవ్వవచ్చు, నీ హృదయంలో ఉన్న భగవంతుడితో సమానమైన వస్తువు ఈ లోకంలోగాని, పరలోకంలో గాని లేదు. అంత బంగారం నీ హృదయంలో ఉంది. మీ ఇంటిలో ఉన్న బంగారం వలన అది తెలియదు. నీ మనస్సును బంగారం చేసుకొంటే నీ హృదయంలో ఉన్న బంగారం దొరుకుతుంది. నీ హృదయంలో ఉన్న బంగారం నీకు దొరికినపుడు అంటే, భగవంతుడు నీకు వ్యక్తమయినప్పడు ఇంక నీకు మోహం కలుగదు. ఎందుచేతనంటే అక్కడకు వెళ్ళినవాడికి ఆవస్తువు తప్ప రెండోది స్ఫురించదు.

మనలో ఉన్న లోపాలు పోయేవరకు జన్మలు వస్తూనే ఉంటాయి. లోపం లేనివాడికి ఈ లోకంలోనికి రావలసిన పనిలేదు. లోపం ఉన్నవాడు వచ్చితీరతాడు. లోపాలు పోగొట్టుకోవటానికి భగవంతుడు ఇంకో అవకాశం ఇస్తాడు. మనం ఏమి చేస్తున్నాము అంటే లోపాలు పోగొట్టుకోవటం లేదు, కొత్త లోపాలు వాటికి కలుపుకొని మరల జన్మలోనికి వెళుతున్నాము, భగవంతుని పట్ల గౌరవం లేకపోతే, ప్రేమలేకపోతే ఆయన నీ హృదయంలో ఉన్నపటికీ నీకు దూరంగా ఉన్నట్లే. తెలిసినవాడికి దగ్గరగా ఉంటాడు, తెలియని వాడికి దూరంగా ఉంటాడు. నీ లోపల ఉన్న వస్తువు జ్ఞానస్వరూపం. ఆనందస్వరూపం. లౌకికులు చెప్పే మాటలు తీసుకోకుండా భగవంతుడు చెప్పిన మాటలు ప్రమాణంగా

తీసుకొని నీ మనస్సును కుదురుపర్చుకొని నిరంతరము ఆ వస్తువును నీ మనస్సులో స్మరిస్తూ ఉంటే ఆ వస్తువు నీకు అందుతుంది. నీవు పొందవలసినది ఏదో ఇక్కడే పొందు, ఇప్పుడు పొందు, కర్తృత్వం పెట్టుకోవద్దు. శవదృష్టి లోనికి వెళ్లవద్దు, శివ దృష్టిలోనికిరా. నీలో ఉన్న లోపాలను విడిచి పెట్టినప్పుడు నీ హృదయంలో ఉన్న వస్తువు స్పష్టంగా నీకు వ్యక్తమవుతుంది. సందేహరహితముగా నీ బుద్ధికి అదిగోచరిస్తుంది. నీకు సంతోషం ఇచ్చేవాడు, బాధను ఇచ్చేవాడు ఈశ్వరుడే. బాధను ఎందుకు ఇస్తున్నాడు అంటే నీ మీద ఇష్టంలేక కాదు. ఆ బాధ ద్వారా నీలో ఉన్న లోపములను కక్కించటానికి అలా చేస్తున్నాడు. ఈశ్వరుడి ప్రణాళిక అది. ఈ లోకాన్ని విడిచిపెట్టండి అంటారు. అంటే ఈ లోకాన్ని విడిచిపెట్టి పారిపొమ్మనికాదు ఈ లోకంలో ఉన్న దోషాలను విడిచిపెట్టమని చెపుతున్నారు. వీటిని విడిచిపెడితే నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు వ్యక్తమవుతుంది. నీ హృదయంలో ఉన్న వస్తువు ఎప్పుడైతే వ్యక్తమయిందో అప్పుడు నదులు వెళ్ళి సముద్రంలో కలిసినట్లుగా ఈ ప్రపంచం, దేవుళ్ళు, ఈ సృష్టి అంతాకూడా నీ హృదయంలోలయమవుతుంది. ఎవడైతే హృదయగుహలో నిలకడగా ఉన్నాడో నిష్టగా ఉన్నాడో వాడు తిరిగి ఈ దేహమనే గుల్లలోనికి రానక్కరలేదు.. హృదయగుహ దొరకకపోతే నీవు ఏ దేవుడికి భక్తుడవయినా దేహమనే గుల్లలోనికి తిరిగి రావలసిందే, ఈ సంసారచక్రంలో ప్రయాణం చేయవలసిందే. దేహం ఉండగానే హృదయగుహలోనికి వెళ్ళాలి. దేహం పోయిన తరువాత తెలుసుకొంటాను అంటే కుదరదు మరలా దేహం అనే గుల్లలోనికి వచ్చేస్తావు.

దుఃఖానికి కారణం కోరిక. కోరికలను పూర్తిగా తొలగించే వరకూ దుఃఖం తగ్గదు. ఈశ్వరుని పట్ల మనకు పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే, ఆయనను స్మరిస్తూ ఉంటే మనస్సు అణుగుతుంది. ఒక్క స్మరణచాలు మనస్సుఅణగటానికి, మనకు మోక్షం రావటానికి. అయితే అది త్రికరణశుద్ధిగా చేయాలి. మనస్సు, మాట, చేతలో ఎవరైతే శుద్ధంగా ఉంటున్నారో, ఇవి మూడు ఒకటిగా ఉంటున్నాయో వారిని త్రికరణశుద్ధులు అంటారు. వారికిలోచూపు కలుగుతుంది. లోచూపు కలిగిన వారికి లోపల ఉన్న వస్తువు తనంతటతానుగా వ్యక్తమవుతుంది. నీవు ఎవరు? బ్రహ్మం. నేను బ్రహ్మం కాదు అని ఏ తలంపు వచ్చినా దానిని అక్కడే కట్ చేయి. ఆ తలంపులను ఆపకపోతే నీవు బ్రహ్మంకు దూరమవుతావు. మొక్కను లాగినంత తేలికగా చెట్టును లాగలేము. తలంపు పుట్టిన చోట దానిని తొలగించటం తేలిక. తలంపు విజృంభించిన తరువాత దానిని పెకలించటం చాలా కష్టం. నీవు ఏదైతే అవునో ఆ వస్తువు నుండి దూరం చేసే తలంపులు విడిచిపెట్టు. వచ్చినా వచ్చినచోటనే నిర్మూలించు. బ్రహ్మంను విడిచి నేను అనే మొదటి తలంపు వస్తూ ఉంటుంది. అది ఏమి చేస్తుంది అంటే నేనే కర్తను, ఈ ప్రపంచానికి నేనే ఆధారం. ఇదంతా నా మీదే ఆధారపడి ఉంది అని చెపుతుంది. ఈ సృష్టికి ఎవడైతే ప్రాణం పోసాడో వాడే దీనిని చూస్తాడు కాని నీవు కాదు.

పని లేనివాడు సన్యాసి కాదు, వాంఛ లేనివాడు సన్యాసి. మనలోలోకవాసన, దేహవాసన, శాస్త్ర వాసన ఉన్నంత వరకూ ఆత్మజ్ఞానం సంపాదించటానికి ఇవి మూడు అడ్డువస్తాయి. వీటిని తొలగించే వరకూ హృదయగుహలో ప్రవేశించలేవు. హృదయగుహలోనికి ప్రవేశించలేవు అనుకో ఎన్ని జన్మలు

ఎత్తినా దేహమనే గుల్లలో పడి ఉండవలసిందే. హృదయగుహలోనికి వెళ్ళే వరకూ నీకు స్వేచ్ఛ లేదు. మనకు దేహం ఉంది కదా. ఈ దేహానికి సంబంధించిన స్నేహితులను, బంధువులను, విషయములను ఇప్పడు ఒక్కసారి మర్చిపోండి. అలా ఒక్కసారి ప్రయత్నం చేసి చూడండి మీ లోపల ఉన్న హృదయ గుహ ఎలా ఉందో ఇప్పడే మీకు తెలుస్తుంది. నీకు ఆత్మనుపొందాలి అని ఉంది. నిరంతరము ఆత్మకాని విషయాలను ఆలోచిస్తున్నావు. ఇంక ఆత్మను ఎలా పొందుతావు. దేనిని పొందాలో దాని గురించి ఆలోచిస్తే దానిని పొందుతావు. ఆత్మను పొందాలని ఉందికాని ఆలోచన ఆత్మకాని విషయాల మీద ఉంది ఇలా ఉంటే కోటి జన్మలు ఎత్తినా నీవు దానిని పొందలేవు అనాత్మ విషయాల మీద నీ మనస్సు వాలుతూ ఉంటే అలా వాలుతున్న మనస్సును తీసుకొని వచ్చి నీవు ఏదైతే అవునో దానిని స్మరించటమే అభ్యాసం. మనస్సు శిరస్సులో ఎలా ఉంటుందో అలా దానిని హృదయంలో నిలబెట్టి ఉంచటమే అభ్యాసం. మనస్సు చైతన్యానికి స్వాధీనం అయినప్పడు అక్కడపడి ఉంటుంది. అంతవరకు మనస్సు అణిగినట్లు కనిపిస్తుంది గాని అణగదు. కేవలము గుడులు చుట్టూ తిరిగినంత మాత్రం చేత, నదులలో మునిగినంత మాత్రంచేత అది లొంగదు. అలా అని సాధన చేయవద్దు అని చెప్పటం లేదు. చైతన్యానుభవం కలిగితే మనస్సు అక్కడ నశిస్తుంది. నీవు దేనినైతే విడిచిపెట్టాలనుకొంటున్నావో అది చెప్పినట్లు నీవు వింటూ ఉంటే నీకు మోక్షం ఏమిటి? ఇలా కోటి జన్మలు ఎత్తినా నీకు మోక్షం రాదు. ఆత్మ సముద్రంవంటిది. అందులో బుడగ మనస్సు. సముద్రంలో ఉన్న నీరే బుడగ ఆకారం ధరించింది. అలాగే ఆత్మే మనస్సుగా కనిపిస్తోంది. బుడగ యొక్కఆకారం పోతే అది నీరే.అలాగే మనస్సు ఏ రూపాలతో, నామాలతో తాదాప్యం పొందుతోందో ఆ రూపాలనుండి, నామాలనుండి మనస్సును విడుదల చేస్తే అది మనస్సుకాదు అది ఆత్మే అని నీకు తెలుస్తుంది. మనస్సు అంటే తలంపుల మూట. పొయ్యిలో ఉన్న ఒకోపుల్ల, ఒకోపుల్ల తీసివేస్తే మంట ఆరిపోతుంది. అలాగే మనస్సులో ఉన్న ఒకో తలంపు, ఒకోతలంపు తీసివెయ్యి అప్పడు మనస్సు అనేది లేదు. మీరు ఆత్మ అన్న సంగతి మీకు తెలుస్తుంది. మీరు ఆత్మను మనస్సుగా చూస్తున్నారు. ఆత్మను మనస్సుగా చూడకుండా ఆత్మగాచూడు. అప్పడు మనో భావనపోతుంది, అఖండ భావన వస్తుంది. నీవు ఏదైతే కాదో అదే నేను అని గట్టిగా అనుకొంటున్నావు. ఆ పిడికిలిలో నుండి విడుదల చేయటానికే ఈ జ్ఞాన యజ్ఞాలు.

**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము - 25-5-98)**